క్లుప్తంగా

కళాశాల ఏర్పాటు విద్యార్థులకు వరం



కళాశాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ ఆప్క గజ్జారాం, డీఐఈవో పరశురాం

కుంటాల: కుంటాలలో ప్రభుత్వం జూనియర్ కళాశాల ఏర్పాటుతో గ్రామీణ విద్యార్థులకు వరంలా మారిందని ఎంపీపీ ఆప్క గజ్జారాం, డీఐఈవో పరశురాం పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం ప్రారంభించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ తుకారాం, ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగనాథ్, టీజీఎల్ఏ జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, జీజేఎల్ అధ్యక్షుడు రవికిరణ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కమిటీ సభ్యులు కె.కృష్ణారావు, తాటి శివ, కె.రమణారావు, జక్కుల గజేందర్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీటీసీ

సారంగాపూర్: మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు సామల పద్మ సోమవారం సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలలో సమస్యలపై సిబ్బందితో ఆరా తీశారు. విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరడంతో విషయాన్ని ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావుకు ఫోన్ ద్వారా తెలిపారు. స్పందించిన ఎంపీడీవో త్వరలో ఏర్పాటు చేయిస్తానన్నారు. తర్వాత మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాల సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

పార్‌పెల్లి విద్యార్థి ఉత్తమ ప్రతిభ



నిర్మల్‌లో సర్టిఫికెట్ అందుకుంటున్న కవిత

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రదర్శన కనబర్చింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎన్‌జీసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 8, 9 తరగతి విద్యార్థులకు భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు స్థితిస్థాపకత అనే అంశంపై పోస్టర్ మేకింగ్, పోయెట్రీ విభాగంలో పార్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కె.కవిత ప్రతిభ కనబర్చింది. ప్రోత్సాహక బహుమతి పొందింది. విద్యార్థికి గైడ్‌గా సైన్స్ ఉపాధ్యాయుడు గంగ సురేశ్ వ్యవహరించారు.

ఆలయ వార్షికోత్సవం



పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం, ఎదుర్కోల్లు తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు తరలివచ్చారు.

డీఎస్సీ అభ్యర్థులకు మాక్‌టెస్ట్

ముథోల్: టీచర్ కొలువులకు సన్నద్ధమవుతున్న డీఎస్సీ అభ్యర్థులకు మోడల్ పేపర్ మాక్‌టెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రజాట్రస్ట్ మెంబర్, మాజీ ఎంపీపీ సుభాష్‌పటేల్ ఓ ప్రకటనలో తెలిపారు. 7న భైంసాలోని నారాయణ పబ్లిక్ స్కూల్‌లో టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8185994492, 7702909648 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అధిక విద్యుత్ బిల్లులపై ఫిర్యాదు

ముథోల్: మండల కేంద్రంలో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని గ్రామస్తులు ఏఈ శ్రీకాంత్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రైవేటు ఉద్యోగి విద్యుత్ మీటర్ల ఉన్న రీడింగ్, బిల్లులపై ఉన్న రీడింగ్ మరో విధంగా ఉందన్నారు. దీంతో అధిక కరెంట్ బిల్లులు వస్తున్నాయని తెలిపారు. ఉద్యోగిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఇవేం రోడ్లు

- పల్లెల్లో రహదారులు అధ్వానం
- కంకరతేలి ప్రమాదకరంగా మారి..
- గుంతల రోడ్లతో ఇబ్బందులు



వట్టోలి-వాస్తాపూర్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



కంకరతేలిన జోహర్‌పూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు

లోకేశ్వరం: గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. పలుచోట్ల కంకర తేలి ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షానికి గుంతలు ఏర్పడుతున్నాయి. రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు మరమ్మతు చేపట్టడం లేదని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. 15 ఏళ్ల క్రితం ధర్మోర నుంచి అబ్దుల్లాపూర్ వరకు నిర్మించిన తారురోడ్డుపై కంకర తేలి దర్శనమిస్తోంది. ఈ రోడ్డుగుండా వెళ్లే జోహర్‌పూర్, పంచగుడి, వట్టోలి, వాస్తాపూర్ గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షాలకు ఏర్పడిన గుంతలతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, బైక్‌లు ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. కురిసిన వర్షాలు, భారీ వరదలకు రోడ్డు కోతకు గురయ్యాయి. వాహనదారులు ఓ గుంతను తప్పించే క్రమంలో మరో గుంతలో పడుతున్నారు. ఈ మార్గం గుండా ప్రయాణికులు వెళ్లాలంటే జంకుతున్నారు. రాత్రివేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు

ఈ రోడ్లపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణిస్తున్నారు. గతంలో నామమాత్రంగా మరమ్మతు చేపట్టినా ఫలితం లేకపోయిందని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయమై పలుమార్లు విన్నవించినా పట్టించుకున్నా దాఖలాలు లేవు. ఇప్పటికైనా స్పందించి రోడ్లకు మరమ్మతు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పట్టించుకోవాలి



రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలుస్తుంది. రాకపోకలకు సాగించడానికి ఇబ్బంది ఉంది. గుంత ఎంత లోతుగా ఉందో తెలియక అందులో పడిపోతున్నాం. అధికారులు పట్టించుకోవాలి. – అసిబొద్దీన్‌పటేల్, ధర్మోర

ప్రతిపాదనలు పంపించాం

ధర్మోర–అబ్దుల్లాపూర్ రోడ్లపై గుంతలు ఏర్పడిన విషయం వాస్తవమే. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఇదివరకే ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతు చేపడుతాం. – కొండయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ, నిర్మల్

బురద రోడ్డుతో ఇబ్బందులు



తానూరు: ముథోల్ ఎక్స్‌రోడ్డు నుంచి దాగాం గ్రామానికి ఉన్న మట్టి రోడ్డుతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కురుస్తున్న వర్షాలకు బురదగా మారడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముథోల్ ఎక్స్‌రోడ్డు నుంచి హంగిర్గా గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎన్‌ఆర్‌జీఎన్ నిధులు రూ.82 లక్షలు మంజూరయ్యాయి. హంగిర్గా నుంచి దాగాం వరకు 3 కి.మీ బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. దాగాం నుంచి ముథోల్ ఎక్స్‌రోడ్డు వరకు 2 కి.మీ మొరం వేసి వదిలేశారు. కురిసిన వర్షాలకు బురదగా మారడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు.

వరండాల్లో మందులు!





రాష్ట్ర ప్రభుత్వం వైద్యా ఆరోగ్యశాఖకు మందులు సరఫరా చేస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్టోర్ రూముల్లో మందులు భద్రపర్చి మండల ఉప ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేయాలి. కాని అధికారుల నిర్లక్ష్యంతో కార్యాలయం వరండాల్లో పడేసి ఉన్న మందులను సాక్షి క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

పదెకరాల్లోపు రైతులకు 'భరోసా' ఇవ్వాలి

లక్ష్మణచాంద: పదెకరాల వరకు ఉన్నవారికి రైతు భరోసా ఇవ్వాలని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి సోమవారం అధ్యక్షతన రైతు మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా పథకం మార్పులపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు ఈ సభ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం రైతు భరోసాపై పలువురు నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ రిజిస్టర్ నర్సయ్య, ఏడీసీసీ మేనేజర్ శిరీష్, పీఏసీఎస్ సీఈవో ఉదయ్, ఏఈవోలు ఉమా, సంతోష్, పవిత్ర, రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు పరిమితి ఉండాలి

కుంటాల: రైతు భరోసాకు నిర్ణీత పరిమితి ఉండాలని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కుంటాల రైతువేదికలో సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకంపై సోమవారం మహాజనసభ నిర్వహించారు. సాగులో ఉన్న పదెకరాలకు మాత్రమే సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, ఎంపీపీ అప్క గజ్జారాం, ఏడీఏ వీణ, ఏవో సోమలింగారెడ్డి, సహకార సంఘం సీనియర్, జూనియర్ ఆడిటర్లు విజయ్ కుమార్, జబీనొద్దీన్, సీఈవో నాగభూషణం పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నిర్మల్‌రూరల్: జిల్లాలోని వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురుకులాలు, వసతి గృహాల్లో ముక్క పట్టిన, పురుగులు ఉన్న బియ్యాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. పాఠశాలలు తెరిచిన తర్వాత కొత్త బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేయలేదని, చాలా రోజులుగా నిల్వ ఉన్న బియ్యంలో పురుగులు పట్టే ప్రమాదం ఉందన్నారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్యుల సేవలు ఎనలేనివి



భైంసాటౌన్: డాక్టర్ అనిల్ జాదవ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు



సర్పాపూర్(జి): డాక్టర్లను సన్మానిస్తున్న విద్యార్థులు

భైంసాటౌన్: రోగుల ప్రాణాలు కాపాడే వైద్యుల సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. సోమవారం డాక్టర్స్ డే పురస్కరించుకుని వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు వైద్యులకు డాక్టర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు డాక్టర్లు దామోదర్‌రెడ్డి, అనిల్ జాదవ్, రాజారెడ్డి, నరేశ్, రామకృష్ణాగౌడ్, తదితరులను కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, నాయకులు పోశెట్టి, సాహెబ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: లయన్స్‌క్లబ్‌తోపాటు వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. వైద్యులు కిరణ్‌కుమార్, నితీశ్‌రాజా, సాయికిరణ్, దినేశ్, సౌజన్యలను వేర్వేరుగా క్లబ్‌ల సభ్యులు సన్మానించారు. వెంకటస్వామి, శ్యామ్‌నాయక్, సుదర్శన్, సంజీవ్‌రావు, వెంకటేశ్వర్లు, జితెందర్, సన్నిత్, రాంచందర్, మానస, స్రవంతి, శ్వేత, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

సర్పాపూర్(జి): డాక్టర్స్ డే పురస్కరించుకొని దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలోని శ్రీ విజ్ఞాన్ మోడల్ స్కూల్ విద్యార్థులు సర్పాపూర్(జి) 30 పడకల సామాజిక ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు వైద్యులు అందిస్తున్న చికిత్స, ఆస్పత్రి పరిసరాలు, వైద్య పరికరాల వివరాలను వైద్యుడు రాకేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యుల సేవలను గుర్తించి శాలువతో సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రవణ్, వైద్యులు రాకేశ్, డాక్టర్ షగుప్త అంజుమ్ పాల్గొన్నారు.



ఖానాపూర్: సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని వాసవి పాఠశాలలో డాక్టర్స్ డే నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణుడు కృష్ణంరాజు హాజరై మాట్లాడారు. వైద్యుడు దేవునితో సమానమని విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ పోతారెడ్డి, ప్రిన్సిపాల్ రాజకుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వన మహోత్సవం

- మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు

కుంటాల: జిల్లా వ్యాప్తంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పల్లెల్లో రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో తదితర చోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. కుంటాల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ ఆప్క గజ్జారాం అధికారులతో కలిసి మొక్కలను నాటారు. ఎంపీడీవో ఎంఏ రహీం, ఏడీఏ వీణ, వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఏఈవో ప్రగతి, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, ఎఫ్ఏ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో..

సారంగాపూర్: వనమహోత్సవంలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో అధికారులు మండల వ్యాప్తంగా 2,450 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని కార్యదర్శులు, ఎఫ్ఏలకు సూచించారు. ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీవో లక్ష్మీరెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ అధికారి కుతుబుద్దీన్, అటవీ సిబ్బంది ఉన్నారు.

తానూరులో..

తానూరు: కోలూరు గ్రామంలో అధికారులతో కలిసి ఎంపీడీవో అబ్దుల్ సమద్ మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, టీఏలు ప్రసాద్, శివరాజ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సోన్‌లో..

సోన్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో వనహరిత మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూవెల్మల్ గ్రామంలో సాయిబాబా ఆలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఎంపీడీవో సురేశ్, వైస్ ఎంపీపీ అంకుల్ నాగయ్య వివిధ పూల మొక్కలు నాటారు. నాటిన మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక అధికారి రాజమల్లు, ఏపీవో మంజుల, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, టీఏలు కృష్ణ, సంధ్య, ఎఫ్ఏ లక్ష్మణ్, కారోబార్ మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, వడ్యాల్ గ్రామాల్లో ఉపాధి హామీ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీల నుంచి తెచ్చిన మొక్కలను నాటి నీరు పోశారు. పంచాయతీ కార్యదర్శి హరిత, ఎఫ్ఏ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నిర్మల్ రూరల్‌లో..

నిర్మల్‌రూరల్: మండలంలోని కొండాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి మొక్కలు నాటి నీరు పోశారు. ఎంపీడీవో గజానన్, ఐకేపీ ఏపీఎం తుల రామకృష్ణ, నాయకులు విలాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కుంటాల: మొక్క నాటుతున్న ఎంపీపీ ఆప్క గజ్జారాం



సారంగపూర్: జామ్‌లో



నిర్మల్‌రూరల్: మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపీపీ



తానూరు: కోలూరు గ్రామంలో



లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌లో..

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

మామడ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ రాథోడ్ అమృత అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అమృత, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు వైద్యసిబ్బంది, అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగుస్తుండటంతో ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ సోనియా, పీఏసీఎస్ చైర్మన్ హరీశ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, డీఎల్‌పీవో రమేశ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సుశీల్‌రెడ్డి

మండల సర్వసభ సమావేశం

బాసర: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అశోక్ కుమార్ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ముందుగా పల్లెల్లో గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. జూలై 3తో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగుస్తుండడంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ మెంబర్‌ను సన్మానించారు. ఇక నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని ఎంపీడీవో తెలిపారు.

బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్బీఐలో సోమవారం బ్యాంక్ డే నిర్వహించారు. స్థానిక బస్టాండ్ బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్ ఆధ్వర్యంలో సీనియర్ ఖాతాదారులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బ్యాంకు ఉద్యోగులు ఒకరినొకరు బ్యాంక్ డే శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

'వంజరి'లకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఖానాపూర్: వంజరి కులస్తుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని గోసంపల్లె గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ విషయమై సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గతంలో ఎస్టీలుగా ఉన్న వంజరీలను గత పాలకులు ఎస్టీ జాబితా నుంచి తొలగించి బీసీడీ౹లో వేశారని, వెంటనే తిరిగి ఎస్టీలుగా పునరుద్ధరించాలన్నారు. సమావేశంలో నాయకులు అమంద శ్రీనివాస్, నామెడ దర్మరాజు, అమంద కుమార్, కాలేరు కిరణ్, అమందు స్వామి, కాలేరు విలాస్, కాలేరు శ్రీనివాస్, దాత్రిక లక్ష్మీరాజం, లవంగ శివ, కరిపె రాజ్‌కుమార్, బొడికె సంతోశ్, పోచమ్మ, తదితరులు పాల్గొన్నారు.